

# అభిమానులతో ఉగాది

జలంధర

మన జీవితాల్లో చాలా పండుగలు వస్తూ ఉంటాయి. పోతూ ఉంటాయి. కొన్ని సందడిగా, కొన్ని దండగ్గా, కొన్ని చడీచప్పుడూ లేకుండా వెళ్ళిపోతాయి. ఎన్ని పండుగలు గడిచినా, నాకుమాత్రం కొన్ని సంవత్సరాల క్రితం 'ఉగాది' మరువురానిది.

ఆరోజు, తెల్లవారుఝామునే లేచి, హడావిడిచేసి హైరాన పడిపోతున్నాను నేను. అసలు నేను చాలా కంగారు మనిషిని. ఆ విషయం ఎవరన్నా అంటే మాత్రం భరించను. నేను చాలా స్థితప్రజ్ఞురాలినని నా నమ్మకం.

"అబ్బబ్బ! ఎందుకంత హడావిడి? ఎవరి మీద పొద్దున్నే కేకలూ?!" బద్ధకంగా లేస్తూ అన్నారు మావారు.

"చూడండీ ఈ రామునీ! ఉగాది వచ్చెడికి షడ్రుచులు కలవాలని అంటారు కదా! పోయి వేపపూత, మామిడి కాయలూ తీసుకురారా అంటే, మామిడి పూత, వేపకాయలు తెచ్చిపెట్టాడు. పరమానందయ్య శిష్యరకం వీడూనూ అసలు ఇదంతా మీ ట్రైనింగ్ మహత్యం.."

"ఆవుతల్లీ ఇంక...అయినా అదేమిటిరా!" నవ్వు ఆపుకుంటూ అన్నారు మా వారు.

"అది కాదండీ?! అమ్మగారు నిన్న అలాగే?.."

"ఛా! నోర్ముయ్...ఇప్పుడెలా?" అరిచాను నేను.

"పోన్లేద్దూ! వాటితోనే చేసెయ్యి"...మావారి ఉచిత సలహా.

"ఏదీ! వేపకాయలు, మామిడిపూతతోనూనా? ఎట్లా ఉంటుందో తెలుసా?"

"మామూలుగానే ఉంటుందిలే..నీ వంటలో పెద్ద తేడాలెలా తెలుస్తాయి లెద్దూ.." మావారు సత్యం సెలవిచ్చారు పాపం. మండిపోయింది నాకు. మా వారు అటూ ఇటూ తిరుగుతూ నా వంటలమీద జోక్స్ వేస్తున్నారు. 'ఫ్రెంజీ' పిక్చర్లోలా అన్నీ అద్భుతంగా కనపడుతూ ఉంటాయి ఒక్క రుచి తప్ప..'ఇది మావారి కామెంటు.

"ఏమండీ! పిల్లల్ని లేపండీ..పంచాంగం అవీ పెట్టి పూజ చేయాలి. అవునయ్యా! కొత్తది పట్టుకొచ్చావా?" మా మేనల్లుడిని అడిగాను.

"ఆఁ!" అని దేవుడిదగ్గర పెట్టాడు ఒక ఫోల్డరు. ఏమిటబ్బా అని విప్పి చూద్దునుకదా సినిమా గ్లామర్ క్వీన్స్ సచిత్ర సినిమా కాలెండరు.

"ఏమిటయ్యా ఇది?! రామరామ..ఇంకా నయం.పూజ చేశాను కాదు. అసలే హడావిడి మనిషిని నేను"

"నష్టమేంలేదు. మా సినిమావాళ్లకు ఏం తక్కువ. పూజకు పనికిరామా? ఏంరా?!" మేనల్లుడుని అడిగారు మా ఆయన.

"నిజమే మావయ్యా దేముళ్ల కాస్ట్యూంస్‌లో ఫస్ట్‌గా ఉంటారు" అసలే పబ్లిసిటీ ఆర్టిస్టు మా మేనల్లుడు.

"ఏమిటి ఇవ్వాళ నువ్వేవంటా? ఏది..పండగనాడు కూడానా?" మా వారు అడిగారు.

"మీరు పండగపూట ఇంట్లో ఉండటమే అరుదు. అందుకే నేను వంట చేద్దామనుకుంటున్నానండీ"..అతి నమ్రతగా భారతనారీ సంకల్పం ప్రకటించాను.

"ఏడ్చినట్లుంది పాతివ్రత్యం. ఈ ఆడవాళ్లు ఎన్నివిధాల చంపగలరు? ఆఖరికి వంట చేసికూడా!"

"అయినా ఇవ్వాళ షూటింగ్ లేదా మామయ్యా!" చాలా అమాయకంగా అడిగాడు మా మేనల్లుడు! ఎంత జాలో ఆ గొంతుకలో ఆ అబ్బాయి మాటలకు అర్థం తెలిసిన దాన్నికాబట్టి ఎర్రగా చూశాను ఇద్దరివంకా.

ఇంతలో కాలింగ్‌బెల్లు మ్రోగింది.

"పోయి తియ్యండి తలుపు.."

"నువ్వు తీద్దూ!" అన్నారు మావారు. పనివాళ్లు పెరట్లో బిజీ. మా మేనల్లుడు స్నానాలగదిలో ఉన్నాడు.

"నాకేం పట్టే! చచ్చేంత పనుంది. పిల్లలశ్రుతిపెట్టి వెతకాలి. ఇల్లంతా సాంబ్రాణి వెయ్యాలి. కొత్త సంవత్సరం ఏదన్నా రాయాలి. మొన్న మేగజైన్‌లో కొత్త వంటకం కటింగ్ ఎక్కడో పెట్టాను వెతకాలి. ఎంత పనుంది?! అయినా ఎవరు వచ్చినా మీ కోసమేకదా!" అక్కసుగా అన్నాను. మరి ఫాన్స్ ఫొటోగ్రాఫ్‌లు ఆటోగ్రాఫ్‌లు అంతా హడావిడి ఆయనకేగా.

ఒక ఐదు నిముషాల తరవాత, "వాళ్లు నీ కోసమే వచ్చారు. నిన్ను చూడాలట..." అంటూ వచ్చారు మావారు.

"నా కోసమా? చెయ్యి తీరికలేదు. ఏదో చెప్పి పంపించెయ్యకూడదూ మీరే.." గేట్ క్రాషింగ్ చేసి దానాలు పట్టే వారే నా కాండిడేట్స్ అని మా వాళ్లు పేరు పెట్టారు.

"కాదోయ్ నిన్ను చూడందే వెళ్లరట. నీ ఫాన్స్‌ట. నీ కథలవీ చదివారట."

ఒక్కసారిగా ఆనందం వేసింది చెప్పొద్దూ 'చూశారా?' అన్నట్లు మా వారివంక ఒక చూపు చూసి ఆగి హాల్లోకి వెళ్లాను.

రిపటలా ఒక అమ్మాయి, సరిగ్గా వ్యతిరేకంగా పాతకాలపు తిరపతి లడ్డూలా మరొక అమ్మాయి, బెల్ బాటమ్స్ వగైరాలతో దసరాబుల్లోడులాంటి అబ్బాయి.

"నమస్కారమండీ! మిమ్మల్ని చూడటం కేవలం మా అదృష్టం.." అన్నారు ఆ ఇద్దరు ఆడపిల్లలు.

"పాపం. చాలా బిజీగా ఉన్న టైంలో వచ్చినట్లున్నాం. పండగకూడానూ వంటా అదీ మీరే చేసుకుంటారా అండీ- అందులో ధైర్యంగా కనిపించే రెండుజెళ్ల అమ్మాయి అన్నది.

ఆరోజు నేను వంటచేస్తున్నందుకు మొట్టమొదటిసారిగా చాలా సంతోషించాను మనస్సులో. అయినా వీళ్లకు నా వంటగురించి ఎలా తెలుసు? అని ప్రశ్నార్థకంగా చూసేటప్పటికి మావారు అతి వినయంగా నా చేతిలో గరిట లాక్కున్నారు.

"అవునండీ! నేనే చేస్తాను. ఎంతపనీ..ఇంట్లో వాళ్లందరి ఆరోగ్యాలు సరిగ్గా ఉండాలంటే మనమే చూడాలికదండీ.."

ఇంకా లెక్చర్లు కొట్టేదాన్నే కానీ, డైటింగ్ పేరుతో ఒక్క నెల్లో 5 కిలోలు దిగిపోయిన మావారూ, ఏదో జ్వరం వచ్చి నీరసపడిపోయిన నా మేనల్లుడు...ఈ ఇద్దర్నీ వాళ్లు నిర్ఘాంతపోయి చూస్తారేమోనని నోరు మూసుకున్నాను.

ఒక రెండు సెకన్లాగి...

"మీరిట్లా ఉంటారనుకోలేదండీ..." ధైర్యవంతురాలు అన్నది. చూడ్డానికి బావుంది ఆపిల్ల.

"ఏం" నవ్వుతూ అన్నాను.

"మీరేదో చుట్టచుట్టుకుని, కళ్లజోడు, పెద్దబొట్టుతో ఉంటారని ఊహించుకున్నాం మీ రచనలనుబట్టి"

ఈ సారి నిర్ఘాంతపోవడం నా వంతైంది. ఆకు చెప్పులు, చేతిలో గొడుగు మర్చిపోయినట్లున్నారు వాళ్లు. నా రచనలు ఇలాంటి ఊహల్ని రేపుతున్నాయా పాఠకుల మెదడులో. ఎమెస్కోవాళ్లు పుస్తకం అట్టపైన అందంగా కనిపించడానికి బాపూగారి బొమ్మ అట్టవెనక పాఠకులు అర్థంతరంగా నిరాశ చెందకూడదని రచయిత ఫొటో అందుకే వేస్తారుకాబోలు.

మావారు వాళ్లు నన్ను వర్ణించే విధానంవిని, వస్తున్న నవ్వును ఆపుకుంటూంటే నాకు ఒళ్లుమండింది.

కానీ, మెల్లిగా,

"ఇప్పుడేమనుకుంటున్నారూ?" అని అడిగాను. వాళ్లు నా బెంగాలీ రింగులవంకా, జార్జెట్ చీరవంకా తేరిపారచూచి,

"మీరు ఆ నవలలు రాయలేదనుకుంటాం.."అన్నారు నిర్మొహమాటంగా:

నాకు ఒళ్లు మరొకసారి మండింది చెప్పద్దూ..

"రచనకీ, మనిషికీ ఇంత వ్యత్యాసమా? మీరు రాసిన వ్యాసాలు చదివితే, మీరు చాలా ఉద్రేకపరులనిపించింది."

"వ్యాసాలా?" నా కర్థం కాలేదు.

"ఆవిడ అలాంటివేవీ రాసినట్లు లేదండీ దానికి బోలెడు కామన్ సెన్సు వగైరా కావాలే..."మా వారు అనుమానంగా చూశారు..ఏం చెయ్యాలి ఈయన్ను?!

"అదేమిటండీ! ఆవిడ చాలా రాశారు. మీ అభిమాన రచయిత, రచయిత్రి ఎవరండీ.."


గబగబా చెప్పేశాను

"ఇంతమందిలో ఎవరిష్టమండీ.."

"ఆవిడకు ఆవిడ రచనలంటేనే ఇష్టం...కనుక్కోండి కావాలంటే.."మా వారి విసురు 'ఊరుకోండీ' అన్నట్లు ఉరిమి చూశాను.

మెల్లగా రైటర్లమీద ఒపీనియన్స్ దుమ్ము దులిపి పారేశాం. మధ్యలో వాళ్లకు జ్యూసులు వగైరా తెప్పించి ఇచ్చాము. మా వారు నిస్సహాయంగా గడియారం వంక చూస్తున్నారు.

సరేలే...ఎంత గుర్తించబడ్డ రచయిత్రినైతేనేం.. ఆడబ్రతుకు... అన్నంత దిగులుగా చూసి వంటావిడకు పని పురమాయించి, పిల్లలకు డ్రస్సులు తీసిపెట్టి గబగబా బైటకు వస్తుంటే, 'మమ్మీ నాకు ఈ డ్రస్ వద్దు,' అని ఒకపాప, 'తెల్లఫ్రాక్ కింద నల్ల పిమ్మీ



ఏమిటమ్మా' అని చిన్న పాప...

"ఏదో ఒకటి ఏడవండి...నా ఫాన్స్ వచ్చారు...మాట్లాడుతున్నాను." వీలైనంత ఫోజుగా అని బైట పడ్డాను.

"మొన్న రచయిత్రుల మహాసభలో మీ ఫోటో కొంచెం కట్ అయిందండీ...భానుమతిగారితో మాట్లాడుతూ తీయించుకున్నారు..."

'నేనా? ఏ సభలో?' నాకేదో డౌటు ప్రారంభం అయింది కానీ దాన్ని అణిచేశాను.

'మీ రచనల్లో కసి, విశృంఖలత, ఆడంబరం ఎక్కువగా ఉంటాయండీ...' వాళ్ల పుణ్యమా అని టాపిక్ మార్చాను.

రాసిన ఒకటో రెండో నవలల్లో ఇన్ని భయంకరాలున్నాయా? నాకు ఏమీ అర్థం కావడం లేదు.

"అట్లాంటిదేమీ లేదే..." నసుగుతూ అన్నాను నేను.

"అట్లా అంటే ఎలా? మీవి దాదాపు పదినవలలు చదివాను. నాకు చెప్తారేమిటి?" డబాయించింది ఆ లావాటి అమ్మాయి.

పదినవలలా? నోరు తెరిచాను నేను. నా దగ్గర చాలా అముద్రిత గ్రంథాలయం ఉన్నది కానీ...ప్రింటు అయినవి లేవే...ఏమిటో నాకు అయోమయంగా ఉంది.

"మీరు లెక్చర్స్ అద్భుతంగా ఇస్తారట...మొన్న మహిళా మండలిలో..."

వాళ్లు ఒక టాపిక్ నుంచి ఒక టాపిక్‌లోకి మారారు కానీ, ఇదేదో కొత్త ప్రమాదం.

"నేను...లెక్చర్లా?" ఆశ్చర్యంగా అన్నాను.

"మా ఆవిడ ఇంట్లోవాళ్లకే ఇల్లాంటివి పరిమితం చేసిందనుకున్నాను...ఏదీ బైట కూడా..." చాలా అమాయక, ఆశ్చర్యరసం పోషిస్తున్నారు మా వారు.

"మీ రచనలు వివిధ భాషల్లోకి డబ్బింగ్ చేస్తారని మీరు ఇంటర్వ్యూ ఇచ్చారు. నిజమా?" ఆ అబ్బాయికి ఇప్పటిదాకా మా ఆయనను చూడ్డమే సరిపోయింది. సినిమా తప్ప మరే కళాప్రక్రియా తెలియని కళా పోషకుడు కాబోలు పాపం...

"డబ్బింగ్ అనరు...ట్రాన్స్‌లేషన్ రా!" ఆ తెలివిగల పిల్ల సరిదిద్దింది.

ఊరుకో కూడదూ మా వారు "అబ్బే అల్లాంటిదేం లేదండీ...కేవలం ఆంధ్ర దేశానికే ఆ అదృష్టం పరిమితం..." అన్నారు.

"మీరు డాన్స్ చేస్తారా అండీ!" ఆ లావాటి అమ్మాయి రపీ మని ప్రశ్న రువ్వింది.

"డాన్సా?" అన్నాను నేను బిత్తరపోయి.

"ఆc! వంటింట్లో...మెట్లమీద కాలు జారినప్పుడూ..." మా ఆయన వాక్యం పూర్తి చెయ్యకుండానే నవ్వుతూ పారిపోయారు, రకరకాల రియాక్షన్స్‌తో మా మేనల్లుడితో.

"మరి మీరు ఒక నవలలో డాన్సు గురించి క్షుణ్ణంగా రాశారే..."

ఏ నవలలో? డాన్స్ మీద ఒక కథరాశాను....అదేమో వాళ్లు అనుకున్నది..

"అదా...ఏదో వినికడి..."

వాళ్లు మొఖం, మొఖం చూసుకున్నారు.

"మీ అయిదుగురు పిల్లలూ ఏరండీ?"

"అయిదుగురా?" తెల్లబోయాను.

"కాదాండీ! మరి ఆ పత్రికల వాళ్లు అలా రాశారే...మీరు చాలా ఆదర్శ గృహిణి అని, అన్ని పనులూ మీరే చేసుకుంటారనీ, అర్థరాత్రి తీరుబడిగా సాహిత్య సేవ చేస్తారనీ..."

హతోస్మి! కానీ, ఒక విషయం హాయిగా ఉంది. రాస్తే పిల్లల విషయం తప్పుగా రాయచ్చు కానీ, ఏదీ ఆదర్శ గృహిణి వగైరా...ఎంత మంచి ఒపీనియన్ రాశారు నా గురించి...వెంటనే పత్రిక పేరు అడిగి రెండు సంవత్సరాల చందా కడదామనుకున్నాను. కానీ రెండు వారాలే వచ్చి ఆగిపోయిందిట ఆ పత్రిక.

"ఆగిపోదూ మరి ఇన్ని అబద్ధాలు రాస్తే! పాఠక లోకం శపించి ఉంటుంది..." మా వారు మళ్లీ ఎప్పుడు వచ్చారో...సమయానికి వస్తారు పాపం.

"ఇంతకీ మీ గోవింద శతకం పబ్లిష్ అయిందాండీ?"

"అదేమిటి?" బిత్తర పోయాను.

"అదేనండీ! ప్రతి పద్యానికీ ఆఖరున గోవిందా! అన్న మకుటం ఉంటుందండీ!"

"అట్లాంటివి మా అత్తయ్యగారు రాయరండీ!" నిర్మొహమాటంగా చెప్పి నన్ను రక్షిద్దామని మా మేనల్లుడు ప్రయత్నిస్తున్నాడు. పాపం...నా ఛందస్సు గురించి ఆ అబ్బాయికి బాగా తెలుసు.

"మీరు మొన్న "వెలిగే జ్యోతి" పత్రికలో వస్త్రధారణ, ఉద్యోగం స్త్రీ లక్షణమా? మొగవారికి వంట అవసరమా? ఇలా మంచి శీర్షికలు నిర్వహించారండీ.. మా ఫ్రెండు వ్యాసం రాఫిందట. మీరు ప్రచురించలేదేమండీ?" నిష్ఠూరంగా అన్నది ఆ సన్నటి అమ్మాయి...ఇదెక్కడి గోల? ఈ శీర్షికలు ఏమిటి?! అయినా ఆ పత్రికలు నా సొంతమా వ్యాసాలు వేసుకోడానికి.

"కానీ, మీరేమిటండీ దేశ ఆహార పరిస్థితి రీత్యా వంటింట్లో ఇంగువ వాడచ్చా, వాడకూడదా అన్న టాపిక్ ఏమిటండీ?!" లావుపాటి అమ్మాయి ఉరిమింది.

నాకు అర్థమైపోయింది వాళ్లు నన్ను చూసి ఎవరో అనుకుంటున్నారు కానీ లాభం లేదు. మాట్లాడనిస్తేగా?!

"హృదయంలో అల్లర్లు" అనే నవలికలో మీరు మరీ మృణాళినికి అంతమంది లవ్వర్లను పెట్టారేమిటండీ! మరీ పేజీకి ఒకరా? డిటెక్టివ్ నవలలో విలన్‌ను వెతికినట్లు వెతుక్కోవాల్సి వచ్చింది హీరోను..."

వెంటనే మరొక అమ్మాయి "మీ డిటెక్టివ్ నవల పేరేమిటండీ?" అన్నది.

"నేనారాసింది? అయినా ఇవన్నీ..."బిక్కచచ్చిపోయి అంటున్నాను నేను.

కానీ ఆ అమ్మాయి 'నన్ను మాట్లాడ నివ్వలేదు. "మీరు సాహిత్య పరిశ్రమ ప్రారంభించిన ఒక్క రెండు సంవత్సరాల్లోనే ఇన్ని రకాల సాహిత్య ప్రక్రియలు ఎలా పరిశీలించారు? మీరు ఆ మధ్య "విమర్శే విప్లవం" అనే పత్రికలో సాహిత్యం సమతల భూమి అనీ దాన్ని దున్నే కర్షకుడే కవి అనీ స్టేట్‌మెంటు ఇచ్చారు కదండీ...

ఇంకా నయం పెన్నే నాగలి అన్నాను కాదు. అయినా ఇవన్నీ నేనురాసినవి. నేను అన్నవా? నాలో ఏదో స్ప్లిట్ పర్సనాలిటీ ఉందా? ఘోస్ట్ రైటర్స్ గురించి విన్నాను కానీ, రచయిత్రే ఘోస్ట్‌గా తనకు తెలియనివి రాయడం...

వాళ్లు చెప్పుకు పోతున్నారు నేను కానీ నన్ను గురించి.

ఇంతలో వేపకాయలు మామిడిపూత పచ్చడితో మా వంటావిడ ప్రవేశించి నన్నురక్షించింది. మా మేనల్లుడు గోడకు ఒక కాలు మడిచి పెట్టి స్కెచ్‌లు వేసేస్తున్నాడు. మావారు ఆ కుఱ్ఱాడితో సినిమా విషయాలు మాట్లాడు తున్నారు.

గభాలున లేచి ఆ ఉగాది పచ్చడి అతి ప్రేమగా అందరికీ పెట్టాను నేను, ఉగాది శుభాకాంక్షలతో.

"నాకు ఇంట్లో పనుందండీ!..." మెల్లిగా జారుకుంటూ అన్నాను నేను.

ఆ తరవాత వాళ్లు, మావారు అంతా ఏదో మాట్లాడుకున్నారు. మావారి ఫోటోలు, ఆటోగ్రాఫ్‌లు అవీ తీసుకుని వెళ్లినట్లున్నారు వాళ్లు.

"అమ్మయ్య! ఉగాది మరీ నీరసంగా ఉంటుందేమో అనుకున్నాను గానీ గొప్పగా ఉందిలే" అంటూ నవ్వుతూ వస్తున్న మా వారిని చూసి,

"అయినా! వాళ్లు ఎవరికోసం వచ్చారో కనుక్కోనక్కర్లేదూ..." ఉడుకు మోత్తనంగా అన్నాను.

"వెళ్లేముందు వాళ్లకు అర్థం అయ్యేటట్లు చెప్పానులే నువ్వు రాంగ్ కాండిడేట్ వని...అయినా నీకు ఫాన్స్ వచ్చారు కదా అన్న సంతోషంలో...ఒరేయ్ ఇందాక నువ్వు తయారు చేసిన ఉగాది గ్రీటింగ్స్ పట్రా..."

"నాకు అనుమానమే మీరు వాళ్లను కన్‌ఫ్యూజ్ చేశారని..." అంటూ మా మేనల్లుడు వేసిన గ్రీటింగ్స్ చూశాను...

వాళ్లు వర్ణించిన వర్ణనలో నేను, నా చేతిలో గోవింద శతకం, నా ఎదురుగా గొప్ప కామెడీ ఫేసులతో ఆ ముగ్గురూ.

పిల్లలు నిర్మొహమాటంగా కిలకిలా నవ్వుతున్నారు. పనివాళ్లు మర్యాదగా ఉండదని నవ్వు ఆపుకుంటున్నారు.

"అయినా నాకు ఈ సంవత్సరం రాశి ఫలాలు బాగాలేవు లెండి" కొద్దిగా పోపులో ఆవాలు విసిరేస్తూ అన్నాను.

'అమ్మగారూ! పాయసంలో చారు పోపు వేసేస్తున్నారు...." వంటావిడ అరుస్తూ వచ్చింది.

"తల్లీ! ఈ సంవత్సరం అంతా ఇంతేనా?!" కోరస్‌లో పిల్లలూ, మావారూ, ఘా మేనల్లుడూ.

అదండీ! ఆ సంవత్సరం ఉగాది!